క్లుప్తంగా

నేటి నుంచి జగనన్న సురక్ష

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో శుక్రవారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు నగరపాలక కమిషనర్ హరిత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి 45 రోజులు నిర్వహించనుందని తెలిపారు. నగరంలోని 103 సచివాలయాల పరిధిలోని 1,11,527 ఇళ్లలో ఉన్న 4,11,686 మందికి రక్తపోటు, షుగర్, మలేరియా, డెంగీ, మూత్ర, హిమోగ్లోబిన్, గళ్ల పరీక్షలు చేస్తామన్నారు. అనంతరం 30 నుంచి వచ్చే నెల 27వ తేదీవరకు ప్రముఖ స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యం అందిస్తామని తెలిపారు.

సంక్షేమాభివృద్ధికి పెద్దపీట



భాకరాపేట : జగనన్న ప్రభుత్వం సంక్షేమాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం చిన్నగొట్టిగల్లులో నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని 10 సచివాలయాల పరిధిలోని 97 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. ఎంపీడీవో దేవేంద్ర బాబు, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచులు మనోహర్, శంకర్‌రెడ్డి, భూపాల్; విజయ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ సోమశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం



చంద్రగిరి: మండలంలోని రెడ్డివారిపల్లికి ఎల్ఎస్ నగర్‌కు చెందిన భూమిరెడ్డి తిషాంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం రాయలపురం పంచాయతీ వెంకటంపేట పాఠశాలలోని నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌టీసీ) విద్యార్థులకు అన్నదానం చేశారు. తమ ఇద్దరు పిల్లల పుట్టిన రోజున ప్రతి ఏటా అన్నదానం చేస్తున్నట్టు వారు తెలిపారు. సంపూర్ణమ్మ, భవాని, ఎంఈవో లలిత కుమారి, సర్పంచులు వెంకటయ్య, భాస్కర్ రెడ్డి, టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నటుడు విశాల్

తిరుమల: శ్రీవారిని గురువారం రాష్ట్ర మంత్రి జోగి రమేష్, సినీ నటుడు విశాల్, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మృదంగం విద్వాంసులు ఎల్ల వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. నటుడు విశాల్ తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

మృతులకు నివాళి



మృతునికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ వీఆర్వో హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మద్దతుదారు జయరామిరెడ్డికి గురువారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి ఉన్నారు.


పాఠ్యాంశంపై ప్రిపేర్ అవ్వాలి

పాకాల: తరగతి గదిలో టీచర్లు తాము చెప్పే పాఠ్యాంశంపై ముందుగానే ప్రిపేర్ అవ్వాలని ఎంఈఓ-2 లింగయ్య తెలిపారు. ఆయన గురువారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో 5 తరగతి, ఎల్లంపల్లి ఎంపీపీ పాఠశాలలో 2వ తరగతి విద్యార్థుల తెలుగు సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎం నాగరాజ, టీచర్లు సుబ్రమణ్యం, సురేష్‌కుమార్, గోవిందయ్య, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హుండీ చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి కొత్త హుండీలో సొమ్మును అపహరించిన కేసులో ఆదోని హనుమాన్ నగర్‌కు చెందిన వై.మహేష్‌కు రెండు నెలలు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ జడ్జి కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. మహేష్ ఈ ఏడాది ఆగస్టు 29న శ్రీవారి ఆలయంలోని కొత్త హుండీలో రూ.500 అపహరించాడు. సీసీ టీవీల ద్వారా గుర్తించిన టీటీడీ విజిలెన్స్ సిబ్బంది తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి మహేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారీ గేట్లు



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు షురూ

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో భారీ గేట్లు, సీసీ కెమెరాలు, విద్యుత్ కటౌట్లు ఏర్పాటుచేస్తున్నారు. అన్నమయ్య కూడలిని సుందరంగా తీర్చిదిద్దారు. రామభగీచ ప్రాంతంలో పోలీసుల కోసం ప్రత్యేకంగా జర్మన్ షెడ్స్‌తో కూడిన కమాండ్ కట్రోల్, వివిధ ప్రాంతాలను పూలతో అలంకరించారు. రోడ్లపై స్వాగత తోరణాలు పెట్టారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



స్వాగత తోరణాలు



రాంభగీచా వద్ద ఏర్పాటుచేసిన జర్మన్ షెడ్స్



అన్నమయ్య సర్కిల్‌కు నూతన మెరుగులు



లేపాక్షి సర్కిల్ వద్ద పూల మొక్కల నడుమ శ్రీవారి ప్రతిమ

డబుల్ ధమాకా..





తిరుపతి నగరానికి ఎలక్ట్రికల్ బస్సు అందుబాటులోకి వచ్చింది. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద బస్సుకు పూజలు చేశారు. అనంతరం నాయకులతో కలిసి బస్సులో కొంతదూరం ప్రయాణించారు.

\- తిరుపతి కల్చరల్

కొండలు ఎక్కుతూ.. గుట్టలు దాటుతూ..

- ప్రజల సమస్యలు తెలుసుకున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి
- నేనున్నానంటూ భరోసా కల్పించిన వైనం



జయలక్ష్మీపురానికి అడవి మార్గంలో వెళ్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం మండలంలోని అనుప్పల్లి పంచాయతీ ముసలాయన ఇండ్లు, రెడ్డివారి ఇండ్లు, గోకులాపురం, ఎస్టీ కాలనీ, భువనేశ్వరిపురం, జయలక్ష్మీపురం, చెరువుకాడ ఇండ్లులో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన కొండలు ఎక్కుతూ, గుట్టలు దాటుతూ ఎంతో కాలంగా అడవిలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి వద్దకు వెళ్లారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, సర్పంచి గోవర్ధన్, నెత్తకుప్పం డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, పంచాయతీ కన్వీనర్లు సతీష్ రెడ్డి, కేశవులు రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నిరంజన్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, మధు, ఎద్దుల బాబురెడ్డి, యశ్వంత్ రెడ్డి, నాదముని, శంకర్‌రెడ్డి, దేవరాజుల రెడ్డి, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపలోనూ ఆత్మీయ పలకరింపు



లింగేశ్వరనగర్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి గురువారం తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర నగర్ పంచాయతీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆమెకు సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన నియోజకవర్గ ప్రజలకు మంచి చేయడం కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదని, తన బిడ్డలను కూడా అదే బాటలో నడిపిస్తున్నారని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తన బిడ్డ, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

ఈసీ మెంబర్‌కు అభినందనలు



టీసురేంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ కే.ప్రకాశ్‌రెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఈసీ మెంబర్‌గా ఎంపికైన సీకాం విద్యాసంస్థల అధినేత టి.సురేంద్రనాథ్‌రెడ్డిని రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.ప్రకాశ్‌రెడ్డి గురువారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యావేత్తగా అపార అనుభవం వున్న సురేంద్రనాథ్‌రెడ్డి ఎస్వీయూలో విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ వై.కొండారెడ్డి, ఆనందరెడ్డి, విజయ్‌రెడ్డి, హెచ్‌ఓడీ నిరంజన్‌రెడ్డి, మధుర పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



స్వామి అమ్మవార్లు అమావాస్య ఉత్సవంలో పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం వైభవంగా అమావాస్య ఉత్సవం జరిగింది. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టించి, ఊరేగించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను ప్రజలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

యువత అవధాన జ్ఞానం వైపు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మాడుగుల నాగఫణిశర్మ

తిరుపతి సిటీ : యువత అవధాన జ్ఞానం వైపు దృష్టి సారించాలని సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీలో కేంద్ర శిక్షణ మంత్రిత్వ శాఖ, హర్యానాలోని రిషి హుడ్ యూనివర్సిటీ, తిరుపతి ఎన్ఎస్‌యూ సంయుక్తంగా నాలుగు రోజులు నిర్వహించిన జాతీయ స్థాయి అష్టావధానం, శతావధానం, సహస్రావధాన పండితుల సదస్సు గురువారం ముగిసింది. ఇందులో సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవధానంలో మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి, హ్యూమన్ సైన్సెస్ రిషి హుడ్ యూనివర్సిటీ, హర్యానా డైరెక్టర్ సంపదానందం మిశ్రా, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ కులపతి శ్రీనివాస వర్కేడి, అడిషనల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ దూరదర్శన్ (రిటైర్డ్) ఆర్ఎ.పద్మనాభం, రిజిస్ట్రార్ చల్లా వెంకటేశ్వర్, అకాడమిక్ డీన్ ఆచార్య పవీ.రాఘవాచార్యులు పాల్గొన్నారు.

16న ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

తిరుపతి కల్చరల్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం ఉదయం 10 గంటలకు లీలామహల్ సర్కిల్‌లో క్రెడాయ్ ఉమెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు క్రెడాయ్ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు ఎం.రామప్రసాద్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని రిలే నిరాహార దీక్షలు



ఎర్రావారిపాళెంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ఎమ్మార్పీఎస్ నేతలు

భాకరాపేట : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ కో ఇన్‌చార్జి రాధాకృష్ణ, తిరుపతి జిల్లా ఎమ్మెస్పీ అధ్యక్షుడు తురకా అమర్‌నాథ్ తెలిపారు. ఎర్రావారిపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ దస్తగిరయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి సుండుపల్లి రవి, నాయకులు నాగరాజ, ఆంజనేయులు, నాగార్జున, ధర్మరాజు, వెంకటేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తరహాలో తిరుపతి శుభ్రత అవసరం



మాట్లాడుతున్న తిరుమల యువకుడు నైనార్ కేశవులు

తిరుపతి కల్చరల్: టీటీడీలో తిరుపతి నగరం ఒక్కటని, శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులు అడుగిడే తిరుపతి నగరంలో భక్తి భావన కల్పించాల్సిన అవసరం ఉందని తిరుమల యువత విజ్ఞప్తి చేశారు. ఆ దిశగా తిరుపతి పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపి తిరుపతి నగరాన్ని అభివృద్ధి చేసేందుకు టీటీడీ సహకారం అందించాలని కోరారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల శ్రీవారి ఆలయానికి దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు తిరుపతి నగరానికి వస్తుంటారని తెలిపారు. ఈ క్రమంలో తిరుపతిని పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, సుమారు 1600 మంది కార్మికులు అవసరం ఉందన్నారు. టీటీడీ సహకరించాలని కోరారు. సమావేశంలో తిరుమల యువత నైనారు కేశవులు, సి.శరత్ యాదవ్, పాల శీను యాదవ్, ఎన్.జగదీష్, కిరణ్ రాయల్, పవన్, సురేష్, షణ్ముగం, నరసింహ, శ్యామ్‌కుమార్, కిషోర్, కుమార్, మురళి, ఎన్.శేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రాల మధ్య వారధి హిందీ భాష

తిరుపతి సిటీ: రాష్ట్రాల మధ్య వారధిగా హిందీ భాష పనిచేస్తోందని పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మహదేవమ్మ తెలిపారు. జాతీయ హిందీ దినోత్స వం సందర్భంగా గురువారం కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హిందీ భాష ఉచ్చరణ, అనువాదం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. రాబోవు రోజుల్లో హిందీ విశ్వ భాషగా రూపాంతరం చెందుతుందన్నారు. అనంతరం ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు గ్రహీత మహదేవమ్మను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు ఉమారాణి, పి.వెంకటలక్ష్మి, జి.సుధాకర్, క్రిష్ణవేణి, నీరజ పాల్గొన్నారు.

16, 17న యాదవ మహాసభ కార్యవర్గ సమావేశాలు

తిరుపతి కల్చరల్: ఈ నెల 16,17వ తేదీల్లో తిరుపతిలోని ఉదయీ ఇంటర్నేషనల్ హోటల్‌లో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు దేశ వ్యాప్తంగా 100 ఎంపీ సీట్లు, రాష్ట్రంలో 6 ఎంపీ సీట్లు, 28 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయోధ్య తరహాలో మధురలో శ్రీకృష్ణ మందిరాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

షిరిడీ ఆలయానికి బీరువా వితరణ

తిరుపతి కల్చరల్: కోర్టు వద్దనున్న షిరిడీ సాయిబాబా ఆలయానికి 29వ వార్డు కార్పొరేటర్ ఎం.ఆదిలక్ష్మి తన చిన్న కుమారుడు సాయి ప్రసాద్ జ్ఞాపకార్థం గురువారం బీరువా వితరణ చేశారు. తాళాలను ఆలయ గౌరవాధ్యక్షుడు ఎం.సునీల్ చక్రవర్తి, కార్పొరేటర్ నరసింహకు అందజేశారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయం



పనపాకంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీవో రమేష్ బాబు

చంద్రగిరి: కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఎంపీడీవో రమేష్‌బాబుతో కలిసి పనపాకం పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీలో 32 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలో సుమారు 429 వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ మంజూరయ్యాయన్నారు. అనంతరం ఐతేపల్లి సచివాలయంలో పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శశిరేఖ, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ గోపాల్, వైఎస్సార్ సీపీ దక్షిణ మండల అధ్యక్షులు అగరాల దేవారెడ్డి, జూపార్క్ డైరెక్టర్ మణియాదవ్, పంచాయతీ అధ్యక్షులు పానేటి చెంగల్రాయులు, అమాస నాగేశ్వరరావు, దుర్వాసులు, సచివాలయ కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకుందాం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో వినాయక చవితి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని తిరు పతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం కమిటీ సభ్యులతో కలిసి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయంలో వినాయక చవితి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా చవితి పండుగను హైదరాబాద్, ముంబాయి తరహాలో తిరుపతిలో నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. స్థానికులు, తిరుమల శ్రీవారి భక్తులు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కమిటీ విజ్ఞప్తి మేరకు మొదటిసారి సింగిల్ విండో పద్ధతిలో మండప నిర్వాహకులకు కమిటీ కార్యాలయంలో అన్ని శాఖల సమన్వయంతో అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, వెంకటేష్, గుండాల గోపీనాథ్ రెడ్డి, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, కరాటే శ్రీనివాస్, నవీన్, భాస్కర్ నాయకుడు, నారాయణ, వంశీ, కీర్తి వెంకయ్య, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు గౌరవ వేతనం విడుదలపై హర్షం

తిరుపతి కల్చరల్: పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధిగమించి నెలా నెలా గౌరవ వేతనం అందేలా చేసిన సీఎం జగన్‌కు యావత్ క్రైస్తవ సమాజం రుణపడి ఉంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు నెలలకు కలిపి రూ.25 వేలు గౌరవ వేతనం అందించారని పేర్కొన్నారు.

మద్యం దుకాణాలు మూసేయండి

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, గోపీనాథ్ తెలిపారు. వారు గురువారం కలెక్టర్‌ను కలిశారు. వారు మాట్లాడుతూ పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా 3, 5, 7, 11 రోజుల్లో వినాయకసాగర్, చెన్నాయగుంట, దామినేడు చెరువులు, గొల్లపల్లి ప్రాంతాల్లో సామూహిక నిమజ్జనాలు చేస్తామన్నారు. ఆ రోజుల్లో మద్యం దుకాణాలను మూసివేయించాలని కోరారు.